సాక్షి అనకాపల్లి

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



గ్రంథాలయ సెస్సు చెల్లించాలి

గ్రామ పంచాయతీలు గ్రంథాలయ సెస్సు చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు అన్నారు. 8లో



కొండలు, గుట్టలు దాటి..

డీఈవో వెంకటలక్ష్మమ్మ అధికారులతో కలిసి దేవరాపల్లి మండలంలోని గిరిజన గ్రామాన్ని సందర్శించారు. 8లో



త్వరలో ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ

విశాఖ: భీమిలి తీరంలో త్వరలో ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ నిర్మాణం పూర్తి కానుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి చెప్పారు.

న్యూస్‌రీల్

ఖరీఫ్ సాగుకు ఢోకా లేదు

అనకాపల్లి టౌన్: ప్రస్తుత ఖరీఫ్ సాగుకు ఢోకా లేదని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ఇన్‌చార్జి ఏడీఆర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం నిర్వహించిన టీఎన్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ వరిపంట ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లాలో 81,992 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణానికి 51,494 హెక్టార్లలో 63 శాతం పంటలు సాగవుతున్నాయని చెప్పారు. మిగిలిన విస్తీర్ణంలో రబీకి అనుకూలమైన వరి రకాలు, మొక్కజొన్న, మినప, పెసర, ఉలవలు, బొబ్బర్లు, జనుము పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. జిల్లా అసిస్టెంట్ వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ వరిని 787 శాతం, అపరాలు 217 శాతం, నూనెగింజలు 27 శాతం , వాణిజ్య పంటలు 33 శాతం సాగవుతున్నాయన్నారు. పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను పలువురు శాస్త్రవేత్తలు వివరించారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్ష్మి, రామలక్ష్మి, శరిత, ఉమామహేశ్వరరావు, ఎంబి.జి.ఎస్.కుమారి, వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నేడు 'ఏక్ తారీక్, ఏక్ గంట, ఏక్ సాత్'

తుమ్మపాల: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'ఏక్ తారీక్, ఏక్ గంట, ఏక్ సాత్' అనే నినాదంతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒక గంట పాటు ప్రజలందరి భాగస్వామ్యంతో శ్రమదానం చేయాలని డీపీవో ఆర్.శిరీషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 646 పంచాయతీల్లో 745 గ్రామాల్లో రెండు కార్యక్రమాల చొప్పున 1,706 చోట్ల శ్రమదానం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. పరిసరాలలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులు చేసి పరిశుభ్రం చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొనాలన్నారు. స్వచ్ఛతా హి సేవ ఆన్‌లైన్ పోర్టల్‌లో పరిశుభ్రత ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయాలన్నారు.

రేపటి స్పందన రద్దు

తుమ్మపాల: ఈనెల 2వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం రద్దయినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 మహాత్మగాంధీ జయంతి ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఆరోజు స్పందన ఉండదన్నారు.



దాలివలస జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



తుమ్మపాల ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



దేవరాపల్లి మండలం ఎం.అలమండలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవల కోసం బారులు తీరిన ప్రజలు



బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరంలో రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

సామాన్యులకు శ్రీరామరక్ష

జగన్‌బాబు సల్లగుండాలి



కడుపులో రోజంతా గుడగుడలాడినట్టే ఉంటాది. అపుడపుడూ గుండెలో మంట, నొప్పి వత్తాది. జగన్‌బాబు మా ఊర్లో పెట్టిన సురక్ష కార్యక్రమంలో డాక్టేర్లు చూశారు. రత్త పరీచ్చలు చేశారు. గ్యాస్ నొప్పి.. భయం లేదన్నారు. దూరాబారం ఎళ్లలేని మాలాటి ముసిలీ ముతకలు సానా మందికి ఇక్కడ పరీచ్చలు చేశారు. మందులు కూడా ఇచ్చారు. పైసా తీసుకోలేదు. జగన్‌బాబు నూరేళ్లు సల్లగా ఉండాలి.

– గంజి మంగమ్మ, జమాదులపాలెం, కశింకోట మండలం

వైద్య రంగంలో అపూర్వ ప్రయోగం.. ముందుగానే అనారోగ్యానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం..

అవగాహన ఉన్నవారు, ఆర్థిక స్థోమత ఉన్నవారు సైతం అంతో ఇంతో నిర్లక్ష్యం చేస్తారు.. బాధ ఉంటేనే పట్టించుకుంటారు.. లేకుంటే ఫర్వాలేదులే అని అలక్ష్యం చేస్తారు..

కానీ జగనన్న ప్రభుత్వం ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ప్రజల ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేసి, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. స్పెషలిస్టు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. జగనన్న ఆరోగ్య సురక్ష తమ వంటి వారికి శ్రీరామరక్ష అని సామాన్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం
- ఉమ్మడి విశాఖలో తొలిరోజున 14,022 మందికి వైద్య పరీక్షలు
- సుమారు 800 మందిని రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు

అనకాపల్లి రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం జిల్లా నలుమూలలా పెద్ద ఎత్తున ప్రారంభమైంది. జిల్లాలో ప్రధాన కార్యక్రమాన్ని తుమ్మపాల సచివాలయం పరిధిలో నిర్వహించారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎంపీ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలతో కలిసి ప్రారంభించారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఈ సందర్భంగా మాట్లాడుతూ అమర్‌నాథ్ అన్నారు. ఆరోగ్యం విషయంలో చిన్న కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, అలాంటివారికి జగనన్న ఆరోగ్య సురక్ష వరంలాంటిదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రులు, అక్కడ చేసే వైద్యంపై ప్రజల్లో చులకన భావం ఉందని, దాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యులపై ఉందన్నారు. వైద్య రంగంలో ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమాలు ఇప్పటివరకూ ఏ రాష్ట్రంలో చేపట్టలేదన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న విధానాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఎంపీ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతూ మరణాల రేటు తగ్గించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. ఆరోగ్యశ్రీ జాబితాలో గతంలో 1000 వ్యాధులు ఉంటే సీఎం జగన్ 3110 వ్యాధులను జాబితాలో చేర్పించి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారన్నారు. కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సెప్టెంబరు 15 నుంచే ప్రారంభమైందని, ముందుగా జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల పరిధిలో ఉన్న ఆరోగ్య సమస్యలపై ఇంటింటా సర్వే చేపట్టారన్నారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 579 మంది హాజరు కాగా వారందరికీ అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎల్‌బీఎస్‌హెచ్ దేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలిరోజున 14,022 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో 25 చోట్ల శిబిరాలు నిర్వహించి 5502మందికి సేవలందించారు.

దేశంలోనే ప్రథమం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లి మండలంలోని ఎం.అలమండ, కె.కోటపాడు మండలం దాలివలస గ్రామాల్లో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనారోగ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన వైద్యం అందనున్నట్లు చెప్పారు. రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. దాలివలస శిబిరంలో 210 మందికి పరీక్షలు జరిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి పాల్గొన్నారు. ఎం.అలమండలో 366 మందికి వైద్య సేవలు అందించి, 290 మందికి ల్యాబ్ పరీక్షలు జరిపారు. ఇక్కడ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ డిప్యూటీ సీఎం సందర్శించారు.



కశింకోట మండలం జమాదులపాలెం శిబిరానికి హాజరైన ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రతి ఇంటి తలుపు తట్టి వైద్య సేవలందిస్తున్న ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైద్యం కోసం ఎవరూ ఇబ్బంది పడకూడనే ఆశయంతో గ్రామ స్థాయిలోనే స్పెషలిస్ట్ వైద్య నిపుణులతో నాణ్యమైన ఆరోగ్య సేవలందించడం చరిత్రాత్మకమని అన్నారు. గ్రామ స్థాయిలో ఉచితంగా వైద్య సేవలతో పాటు మందులను, ల్యాబ్ పరీక్షలను నిర్వహిస్తూ వైద్య ఆరోగ్య రంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. అనారోగ్యంతో ఇక్కడ వైద్య సేవలు పొందిన వారికి అవసరమైతే పెద్ద ఆసుపత్రులు లేదా ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సైతం పంపించి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వచ్చే వరకు స్థానిక వైద్య బృందం అండగా నిలుస్తుందన్నారు.

మా పల్లెకే డాక్టర్లొచ్చారు..



నాకు బీపీ, సుగర్ ఉన్నాయి. మాటిమాటికి రావికమతం వెళ్లి పరీక్షలు చేయించుకుని తగినన్ని మందులు కొని తెచ్చుకొంటున్నాను. వ్యయప్రయాసతో పాటు ఎన్నో ఇబ్బందులు పడేదానిని. జగన్ బాబు మా పంచాయతీకే డాక్టర్లను తీసుకొచ్చి పరీక్షలు ఉచితంగా చేసి, చాలా మందులు కూడా ఉచితంగా అందించారు. ఇది చాలా మంచి పని. నాలాంటోళ్లకు చాలా ఉపయోగం

– కిల్లాడ అచ్చియ్యమ్మ, రోగి, తట్టబంద, రావికమతం

అనుమానమే పెనుభూతమై..



మృతురాలు పార్వతి



నిందితుడు గణపతి



విషాద వదనాలతో నితిన్‌కుమార్, అఖిష్

- భార్యను కర్రతో కొట్టి చంపేసిన భర్త
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న పిల్లలు

రావికమతం: అనుమానమే ఆ కుటుంబం పాలిట పెనుభూతమైంది. మరణించి తల్లి, అందుకు కారణమై పోలీసులకు చిక్కి తండ్రి.. ఇద్దరూ దూరం కావడంతో ఆ చిన్నారులు దిక్కులేనివారయ్యారు. ఎంతగా పిలిచినా అమ్మ ఎందుకు పలకట్లేదో తెలియక, ఊరంతా తమ ఇంటి ముందు చేరినా.. తండ్రి కనిపించక ఆ పిల్లలు వెక్కివెక్కి ఏడుస్తుంటే చూస్తున్న బంధువులు, ఊరి ప్రజల ఆవేదన వర్ణనాతీతం. మండలంలోని అజేయపురం గిరిజన గ్రామంలో పాంగి గణపతి(41) కట్టుకున్న భార్య పార్వతి(37)పై అనుమానంతో కర్రతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. మృతురాలి తండ్రి వంతల పొట్టి దొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తకోట స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ కుమారస్వామి శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు. గిరిజన గ్రామం అజేయపురానికి చెందిన వంతల పొట్టి దొర కుమార్తె పార్వతితో గణపతికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఆరో తరగతి చదువుతున్న నితిన్‌కుమార్(11), ఒకటో తరగతి చదువుతున్న అఖిష్(6) అనే ఇద్దరు కుమారులున్నారు. గణపతి తరచూ మద్యం సేవిస్తూ, భార్యను అనుమానిస్తూ వేధించేవాడు. ఇరుగుపొరుగువారు సర్దిచెప్తే ఆ రోజుకు గొడవ సద్దుమణిగేది. మళ్లీ తాగి వచ్చి అదే రభస. పార్వతి అన్నీ సహించి పిల్లలను, ఇంటి బాధ్యతల్ని నెట్టుకొచ్చేది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి గణపతి పూటుగా మద్యం సేవించి పార్వతితో గొడవకు దిగాడు. కత్తికి ఉపయోగించే వెదురు పిడి(కొయ్య)తో బలంగా పార్వతి తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తండ్రి పొట్టిదొర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు గణపతిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

డ్వాక్రా మహిళలకు 'అభయ' హస్తం



- వృద్ధాప్య పింఛన్లు వచ్చినా అభయ హస్తం పింఛన్‌కు అర్హులే
- జిల్లాలో కొత్తగా 10,058 మందికి మంజూరు

సాక్షి, అనకాపల్లి: మహిళలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తోంది. ప్రతి అడుగులోనూ సీఎం వైఎస్ జగన్ మహిళలకు అండగా ఉన్నారు. నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లోనే జమ చేస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ అభయ హస్తం పేరిట కొత్త పింఛన్లు కూడా మంజూరు చేశారు. అరవై ఏళ్లు దాటిన ప్రతి డ్వాక్రా మహిళకు నెలనెలా రూ.500 పింఛన్ అందిస్తోంది. గత ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్ వస్తున్న మహిళలకు అభయ హస్తం పింఛన్ వచ్చేది కాదు. దాన్ని సవరిస్తూ.. సీఎం జగన్ ప్రభుత్వం వైఎస్సార్ అభయ హస్తంలో పింఛన్లు అందిస్తోంది. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 2027 మంది అభయ హస్తం పింఛన్లు అందుకుంటున్నారు. ఇపుడు కొత్తగా జిల్లాలో 10,058 మందికి అభయ హస్తం పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో జిల్లాలో అభయహస్తం పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య 12,085కు చేరుకుంది.

వైఎస్ ముందు చూపుతో ఆనాడే అమలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇదే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా అమలు చేస్తోంది. డ్వాక్రా మహిళలందరికీ 60 ఏళ్ల తర్వాత ప్రతి నెలా ఎంతో కొంత పింఛను అందించాలనే వైఎస్సార్ 2008లో అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. తర్వాత కాలంలో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పేరు మార్చి అరకొరగా మాత్రమే అందించింది. వృద్ధాప్య పింఛన్ తీసుకునేవారికి అభయ హస్తం పింఛను నిలిపేసింది. ఫించను ఇచ్చేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మళ్లీ వైఎస్సార్ అభయహస్తం పథకంలో సవరణ చేసి, వారిని అర్హులుగా చేర్చారు.

మరణించినవారికి అసలు, వడ్డీ చెల్లిస్తాం



ఇప్పటికే అందుకుంటున్న వారితోపాటు ఈ ఏడాది మే నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకున్న అర్హులు 10,058 మందికి అభయహస్తం పింఛన్లు కొత్తగా మంజూరు చేశాం. 60 ఏళ్లు దాటి అభయ హస్తం పథకంలో ప్రతి నెలా రూ.30 చొప్పున, రూ.3,650కి పైగా చెల్లించినవారే అర్హులు. వరుసగా మూడేళ్లు లావాదేవీలు జరపనివారికి ఆర్వోసీ(రిటన్ ఆన్ కార్పస్) కింద అసలు, వడ్డీ తిరిగిచ్చేస్తాం. ఇప్పటికే మరణించిన వారికి, అప్పటి వరకు వారు చెల్లించిన మొత్తం, వడ్డీతో సహా నామినీకి అందిస్తాం. అభయహస్తం పథకంలో సభ్యురాలు ఏటా వాటాధనం చెల్లింపు సక్రమంగా లేకపోతే పింఛన్‌కు అర్హులు కాదు.

–బి. లక్ష్మీపతి, పీడీ, డీఆర్‌డీఏ అనకాపల్లి

కళ్ల ముందే అమ్మానాన్నలు బలి



ప్రమాదానికి కారణమైన లారీ



దీనంగా చూస్తున్న యస్మిత, జోషిత

- స్కూటీ లారీ కింద పడి ఘోర ప్రమాదం
- అక్కడికక్కడే భార్యాభర్తలు మృతి
- ప్రాణాలతో బయటపడ్డ చిన్నారులు

కె.కోటపాడు: వరుసగా రెండు రోజులు సెలవులని అత్తారింటికి పిల్లలతో స్కూటీపై బయలు దేరిన భార్యాభర్తలు లారీ కింద పడి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి కె.కోటపాడు మండలం బొట్టవానిపాలెం వద్ద చోటు చేసుకుంది. ఈ ఘటనలో విశాఖపట్నం ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఆడారి దామోదరరావు(32), ఆయన భార్య ప్రసన్న(25) అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలివి. ఆరిలోవ ప్రాంతం నుంచి స్కూటీపై దామోదరరావు, భార్య ప్రసన్న, కుమార్తెలు యస్మిత, జోషితలతో అత్తవారి గ్రామమైన దేవరాపల్లి మండలం వేచలం బయలు దేరారు. చిన్నగా చినుకులు పడుతున్నాయి. స్కూటీపై కింతాడ శివారు బొట్టవానిపాలెం వద్దకు చేరుకునే సమయంలో అదే మార్గంలో పినగాడి నుంచి కె.కోటపాడు వైపు రేషన్ బియ్యం లోడుతో లారీ వస్తోంది. లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించగా, ఎదురుగా వేరే వాహనం రావడంతో వాహనాన్ని ఆపబోయి లారీ వెనుక చక్రాల కిందికి స్కూటీ వెళ్లిపోయింది. వాహనం పైనున్న ఇద్దరు పిల్లలు రోడ్డుపై పడగా, భార్యాభర్తలు లారీ కింద పడ్డారు. ఈ ఘటనలో ప్రసన్న తలపై నుంచి లారీ చక్రం వెళ్లడంతో తల నుజ్జయింది. దామోదరరావు తలకు గాయం కావడంతో రక్తస్రావం అధికంగా జరిగి సంఘటనా స్థలిలోనే మృతిచెందారు. గాయపడిన చిన్నారులను స్థానికులు 108లో కె.కోటపాడు సీహెచ్‌సీలో చేర్చి, వైద్యం అందించారు.

అరగంటలో చేరుకుంటారనగా..

కె.కోటపాడు నుండి అత్తవారి గ్రామం వేచలానికి మరో అరగంట వ్యవధిలో చేరుకుంటారనగా భార్యాభర్తలు మృతి చెందడం స్థానికుల్ని కంటతడి పెట్టించింది. అమ్మానాన్న కళ్ల ముందే మరణించడంతో ప్రమాదంలో బయటపడ్డ చిన్నారులను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. దామోదరరావు ఆరిలోవలో ప్రయివేట్ ఉద్యోగాన్ని చేసుకుంటూ భార్యా, పిల్లలను పోషించుకుంటున్నాడు. ప్రమాదంపై కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ దర్యాప్తు చేస్తున్నారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గ్రంథాలయ సెస్సు చెల్లించాలి

మాడుగులరూరల్: పంచాయతీలు గ్రంథాలయ సెస్సు చెల్లించాలని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు తెలిపారు. కేజే పురం, మాడుగుల గ్రంథాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. కేజేపురం గ్రంథాలయంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పంచాయతీలు వసూలు చేస్తున్న సెస్సును జమ చేయకపోవడం వల్ల గ్రంథాలయాల నిర్వహణ కష్టతరంగా ఉందన్నారు. ప్రజలనుంచి పంచాయతీలు ఇంటి పన్నుతోపాటు గ్రంథాలయ సెస్సుకూడా వసూలు చేస్తున్నాయని చెప్పారు. ఈసెస్సును సకాలంలో చెల్లించకపోవడం వల్ల రూ.కోట్లు బకాయిలున్నాయని తెలిపారు. పెదగంట్యాడ, జిల్లా కేంద్ర గ్రంథాలయసంస్థ భవనాల నిర్మాణానికి ప్రతిపాదించినట్టు తెలిపారు. 11 గ్రంథాలయాల భవనాలకు మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. అనకాపల్లిలో గ్రేడ్-1 గ్రంథాలయం నిర్మాణం చేపట్టేందుకు స్థలసేకరణ జరుగుతోందన్నారు. గ్రంథాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సర్దుబాటు చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: మండలంలో తాటిపర్తి పంచాయతీ శివారు ద్వారకానగర్‌కు చెందిన 30 కుటుంబాల వారు టీడీపీని వీడి శనివారం తారువలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పార్టీలోకి నూతనంగా వచ్చేవారు నాయకత్వంపై పూర్తి నిబద్ధతతో ఉంటే పార్టీ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు గ్రామానికి అవసరమైన తారురోడ్డు, సామాజిక భవనాలు, మౌలిక వసతులు సమకూర్చిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంపై తమకు పూర్తిస్థాయిలో నమ్మకం ఉందని నూతనంగా వైఎస్సార్‌సీపీలో చేరిన వారు తెలిపారు. ఇకపై గ్రామంలో ఒకే పార్టీ నినాదంతో కొనసాగుతామని తెలిపారు. గత ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని వారు చెప్పారు. స్థానిక గ్రామ సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ సంజీవ్ సారథ్యంలో పాతరపల్లి నారాయణమ్మ, అప్పారావు, గోకాడ కొండమ్మ, మెల్లి అప్పారావు తదితరులు పార్టీలో చేరారు.


డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెద ఉప్పలంలో హత్య


హత్యకు గురైన జోగిరాజు (ఫైల్)

ఎస్.రాయవరం: పెద ఉప్పలం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జోగిరాజు(36) హత్యకు గురయ్యాడు. హత్య చేసిన వ్యక్తులు సీసీ రోడ్డుకు ఆనుకుని గల తాటిపెండి వద్ద మృతదేహాన్ని పడేసినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు శనివారం తెలిపారు. మృతుడు సోదరుడు సత్యారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిరాజుకు అదేగ్రామానికి చెందిన కుందూరు రాము కుటుంబానికి మధ్య మనస్పర్థలున్నాయి. రెండు వారాలక్రితం ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. చంపుతానని రాము బెదిరించాడని, తాము పెదల వద్ద పెట్టి సమస్య పరిష్కరించుకుందామని అనుకున్నామని ఇంతలో ఈ ఘోరం జరిగిందని మృతుడి సోదరుడు సత్యారావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. జోగిరాజును, రాము హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల విజయమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయ్యేంతవరకు అవిరళ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మండల శాఖ అధ్యక్షులుగా నియమితులైన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు త్వరలో జరగనున్న ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం ద్వారా ప్రజలకు పార్టీ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

కొండలు, గుట్టలు దాటి..

- గిరిజన పాఠశాలను సందర్శించిన డీఈవో
- నూతన పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన


శారదానది దాటి వెళ్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారు నేరెళ్లపూడి గిరిజన గ్రామంలోని పాఠశాలను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం పరిశీలించారు. దేవరాపల్లిలో జగనన్నకు చెబు దాం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న గ్రామానికి ఏడీ రవిబాబు, మండల విద్యాశాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి కొండలు గుట్టలు, గెడ్డలు దాటి అతి కష్టం మీద చేరుకున్నారు. నేరెళ్లపూడి పాఠశాలను అందరికీ అనువుగా ఉండే సమీప గ్రామమైన బోడిగరువులో నిర్మించాలని స్థానికులు కోరారు. ఇప్పటికే అవసరమైన స్థలాన్ని విద్యాశాఖకు దానం చేశారు. ఆస్థలాన్ని పరిశీలించేందుకు డీఈవో క్షేత్ర స్థాయి పర్యటన జరిపారు. గ్రామస్తులతో మాట్లాడగా బోడిగరువులో పాఠశాల నిర్మించడం ద్వారా తమందరికీ అనువుగా ఉంటుందని ముక్త కంఠంతో స్పష్టం చేశారు. డీఈవో వెంట ఎంఈవో-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి.ఉషారాణి, ఎమ్మార్సీ స్టాఫ్ సీహెచ్ రమేష్, అకౌంటెంట్ ఎం.శ్రీను, సీఆర్పీ గంగాధర్, హెచ్ఎం జి.జగదీశ్వరరావు, ఉపాధ్యాయుడు శివాజీ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.రాము, వలంటీర్ యర్రయ్యదొర ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం నియామకం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ డాక్టర్ల విభాగం కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అనకాపల్లి జిల్లాకు చెందిన డాక్టర్ బొడ్డాడ లక్ష్మీనరసింహారావు నియమితులయ్యారు. పార్టీడాక్టర్ల విభాగం జిల్లా కమిటీని కూడా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బండారు సత్యనారాయణ (చోడవరం), ఉపాధ్యక్షులుగా అనకాపల్లికి చెందిన బొడ్డేడ శ్రీఅలేఖ్య, రామమూర్తి, ప్రధాన కార్యదర్శులుగా మాడుగుల నుంచి శ్రీనివాసరావు, కె.వి.సత్యనారాయణ, సింహాచలం నాయుడు, చోడ వరానికి చెందిన దేవరాపల్లి రవి, అనకాపల్లికి చెంది న వి.కామేశ్వరరావుగుప్త, యాద్ర ప్రదీప్‌రాజు, ఆళ్ల వసంత కుమార్, యలమంచిలి నుంచి మైలపల్లి సత్తిబాబు నియమితులయ్యారు. కార్యదర్శులుగా అనకాపల్లికి చెందిన నిర్మల,బి.ప్రియాంక, పోతుల రాజేష్, విల్లూరి సత్యనారాయణ, మాంద్రపు వీరభద్రరావు, ఉప్పాటి లత, యలమంచిలి నుంచి శరగడం పవన్, పాయకరావుపేటకు చెందిన భాస్కరరావు, పెందుర్తికి చెందిన బి.భానుప్రకాష్, చోడ వరం నుంచి కొండ్ల మహంతి, చంద్రశేఖర్, సత్యదేవ్, నర్సీపట్నానికి చెందిన ఎస్.నాయుడు బాబు ఉన్నారు. సంయుక్త కార్యదర్శులుగా అనకాపల్లికి చెందిన రత్నాల ప్రకాష్‌రావు, బెహరా యర్రంరాజు, బుద్ధా నరసింగరావు, పెంటకోట నవీన్‌కుమార్, పెందుర్తి నుంచి షేక్ నూర్ సాహెబ్, యలమంచిలికి చెందిన పిల్లి త్రినాథ్, ఎయిబోయిన సోమేష్, ఎల్లేటి శ్రీనివాసరావు, పాయకరావుపేట నుంచి గురజాల ప్రకాష్, సరస శివప్రసాద్, చోడవరానికి చెందిన కొత్రిపాక సత్తిబాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడుల కట్టడికి పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై లైంగికదాడులు అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లావిజిలెన్స్‌అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీలు ఎటువంటి అన్యాయానికి గురైనా కమిటీకి తెలియజేయాలన్నారు. కమిటీసభ్యులు తక్షణమే స్పందించి బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు. మండల,గ్రామస్థాయిలో ప్రతి నెలా పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పక పాటించాలన్నారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీల భూహక్కుల గురించి సభ్యులు పలు సమస్యలు లెవనెత్తగా, వారానికి రెండు పర్యాయాలు ఆయా మండలాల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాంలో వీటి గురించి చర్చించి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సమాధానమిచ్చారు. ఎస్పీ కె.వి. మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 15వ తేదీ వరకు 57 యూఐ కేసులు ఉండగా, మధ్యకాలంలో 28 కేసులు నమోదయ్యాయని, 8కేసులు పరిష్కరించగా, ప్రస్తుతం 77 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 261 పిటీ కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో జేసీ. జాహ్నవి, అడిషనల్‌ఎస్పీ విజయభాస్కర్, జిల్లారెవెన్యూ అధికారి బి.దయానిధి, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అజయబాబు, డీవీఏఎంసీ సభ్యుడు జి.ప్రభాకరరావు, డీపీవో శిరీషారాణి, డీఐపీఆర్వో కె.ఇంద్రవతి తదితరులు పాల్గొన్నారు.

బధిరులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

అనకాపల్లి టౌన్: బధిరులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ అన్నారు. స్థానిక పీవీ రమణ రైతు భారతి వ్యవసాయదార్ల సంఘం హాల్లో జిల్లా బధిరుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బధిరుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు త్వర లో భర్తీ చేస్తామన్నారు. బధిరుల ఆల్ఫాబెట్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి, పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సమావేశ మందిరానికి చేరుకుంది. సంఘం జిల్లా అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, వ్యాపారవేత్త ముత్యాల సతీష్, జిల్లా నలుమూలల నుంచి 300 మంది బధిరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా..
జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజలకు ఆరోగ్య భరోసా అందించాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నెరవేరుతోంది. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జనం పోటెత్తారు. శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులకు తమ ఆరోగ్య సమస్యలను చెప్పుకున్నారు. అవసరమైన పరీక్షలు చేయించుకుని, వారిచ్చిన మందులు తీసుకుని ఆనందంగా వెనుదిరిగారు.


టోకెన్ పొందిన రోగులకు రక్త పరీక్షలు

- ఉదయం నుంచే శిబిరం వద్ద బారులు తీరిన జనం
- మండలంలో 276 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు


పౌష్టికాహార ప్రదర్శన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గ్రేస్ కేథరిన్


మందుల పంపిణీలో ఆరోగ్య సిబ్బంది


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి


జమాదులపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: మండలంలోని జమాదులపాలెం సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. 276 మంది రోగులకు వైద్య సేవలందించారు. శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి, మండల ప్రత్యేక అధికారి రోజారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల ప్రజలందరి ఆరోగ్యానికి ధీమా లభించిందన్నారు. వైద్యసేవలు అందించి, ఉచిత మందులిచ్చి, వ్యాధి తీవ్రత ఉన్నవారిని ఉన్నత వైద్యానికి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. ప్రతి సచివాలయ పరిధిలో షెడ్యూల్ వారీగా ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముందుగా ఇంటింటి సర్వే చేసి, ప్రాథమికంగా రోగుల్ని గుర్తించి, టోకెన్లు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రక్త పరీక్షలు చేయించుకున్నారు.

శిబిరంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరక సోమునాయుడు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తరలి వచ్చిన ప్రజలు

జమాదులపాలెంతోపాటు సచివాలయ పరిధిలోని విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల నుంచి ఇంటింటి సర్వేలో టోకెన్లు పొందిన 201 మంది రోగులలో 158 మంది శిబిరానికి వచ్చారు. వీరితో పాటు స్పాట్ రిజిస్ట్రేషన్‌లో అదనంగా 118 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇక్కడి హైస్కూల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి ఉదయాన్నే చేరుకుని, బారులుతీరారు. స్పాట్ నమోదుకు కూడా అవకాశం ఇవ్వడంతో చాలా మంది ఆనందంగా ఆ అవకాశాన్ని వినియోగించారు. కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు ఎస్.తిరుపతిరావు, ఎ.మనీషా, యు.రమేష్, ప్రత్యేక వైద్య నిపుణులు శరత్ చంద్ర, గ్రేసీ కేథరిన్ హాజరై రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

దీర్ఘకాలిక రోగులే ఎక్కువ

శిబిరంలో పాల్గొన్న వారిలో బీపీ, సుగర్, కీళ్ల వాతం, మోకాళ్ల నొప్పులు, శరీర నొప్పులు తదితర దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. నడవలేని వృద్ధులు, వికలాంగులు సైతం సహాయకులతో వచ్చి, వైద్య సేవలు పొందారు. పరీక్షల అనంతరం కొందరిని ఉన్నత వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులకు సిఫార్స్ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద కంటి రోగులను ఆప్తాలమిక్ అధికారి ఆనందరావు పరీక్షించి అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. రోగుల కోసం షామియానాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలకు, కొత్త రోగుల నమోదుకు, రక్త పరీక్షల నిర్వహణకు, మందుల పంపిణీకి, కేస్ షీట్ ఇవ్వడానికి ప్రత్యేక గదుల్లో కౌంటర్లు నిర్వహించారు. ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ పర్యవేక్షించారు. శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సాగింది.

ఆకట్టుకున్న పౌష్టికాహార శిబిరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ తరఫున అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార వంటలు, కూరగాయలు, ఆకు కూరలు, జగనన్న పౌష్టికాహార కిట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వాటి వినియోగ ఆవశ్యకతను శిబిరానికి వచ్చిన గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వివరించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మా ఊళ్లో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. దీని వల్ల ఉచితంగా ఆరోగ్య సేవలు పొందే అవకాశం కలిగింది. పట్టణాల్లో ఉండే వైద్యులు వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మా ప్రతి సమస్యనూ విన్నారు. జాగ్రత్తలు చెప్పారు. బయట కొనాల్సిన పని లేకుండా అన్ని మందులూ ఉచితంగా ఇచ్చారు.

–ఈపు కాంతం, జమాదులపాలెం

తగ్గిపోతుందని చెప్పారు



నడుం, మక్కలు విపరీతంగా నొప్పి పెడుతున్నాయి. ప్రైవేట్ హాస్పిటళ్లకూ తిరిగాను. వారిచ్చిన మందులు చాలా రోజులుగా వేసుకుంటూనే ఉన్నా. అయినా నొప్పి పూర్తిగా తగ్గలేదు. ఇక్కడికి పెద్దపెద్ద డాక్టర్లు వస్తారని ఏఎన్‌ఎంలు, వలంటీర్ చెప్పారు. ముందుగానే నా పేరు రాసుకున్నారు. శిబిరానికి వచ్చి డాక్టర్లకు చూపించుకున్నా. పరీక్షలు చేసి మందులిచ్చారు. తగ్గిపోతుందని ధైర్యం చెప్పారు.

–చరకాన నాగమణి, జమాదులపాలెం

క్లుప్తంగా

చురుగ్గా జాతీయ జెండా రింగ్ పోల్ పనులు


జాతీయ జెండా రింగ్ పోల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక జలగల మదుం జంక్షన్ వద్ద జాతీయ రహదారి(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు, ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్న భారీ జాతీయ జెండా రింగ్ పోల్ పనులను ఎంపీ బీవీ సత్యవతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 రోజుల్లో జాతీయ జెండా రింగ్‌పోల్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గగన వీధిలో నిత్యం ఎగురుతూ ఉండే జాతీయ జెండాతో ప్రజలు, యువతలో దేశభక్తి మరింతగా పెంపొందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ముందుగా అనకాపల్లిలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

పండగలతో యువతలో ఆధ్యాత్మికత


కోలాటంలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న పైడారావు

అనకాపల్లిటౌన్: యువతలో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు వినాయక చవితి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విల్లూరి పైడారావు అన్నారు. గవరపాలెం చినరామ యంగ్ టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం కోలాటం ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి ఉత్సవాలతో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా స్వామివారి పందిళ్ల వద్ద స్కాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. అంతకు ముందు కోలాటంలో ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పొలిమేర అరవింద్, పీలా బాలాజీ, కాండ్రేగుల బాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 445 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,220	4,350
రెండో రకం	4,060	4,200
మూడోరకం	3,820	4.000

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సంక్షేమ రారాజు జగన్

- రూ 80.80 లక్షలతో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి అమర్‌నాథ్


కొత్తూరులో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: అన్ని వర్గాల ప్రజల కోసం వివిధ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రారాజు అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. శనివారం నియోజకవర్గంలో పలు ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు. ఎవరూ ఊహించని విధంగా పల్లె ప్రజల ముంగిటకు సేవల్ని తీసుకొచ్చామన్నారు. మండలంలోని అల్లిఖానుడుపాలెంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, ఊడేరు గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, కొత్తూరులో రూ.25 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. కొత్తూరులో రూ.6 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆర్బీకే భవనాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి అప్పగించారు. వెల్‌నెస్ సెంటర్లలో అందుబాటులో ఉన్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు మంత్రికి కొన్ని వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. సీఎం జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. అందుకే జగనే కావాలి.. జగనే రావాలి.. అని నినదించారు. రాష్ట్ర అభివృద్ధికి, భవిష్యత్తుకు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అవసరమో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, కొత్తూరు, ఊడేరు గ్రామ సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో శాంతి పార్కు అభివృద్ధి


శాంతి పార్కును పరిశీలిస్తున్న ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లిటౌన్: పార్కులను అభివృద్ధి చేయడం ద్వారా పిల్లలు ఆడుకునేందుకు, వృద్ధులు సేదతీరేందుకు ఉపయోగపడతాయని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధి శారదానది ఒడ్డున శాంతిపార్కు అభివృద్ధికి ఎంపీ నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. దీంతో అభివృద్ధి పనులకు అధికారులు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ పనులను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తయితే పట్టణ, మండల ప్రజలకు శాంతి పార్కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పార్కులో వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఇప్పటికే క్రీడా పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. రూ.10 లక్షల నిధులతో విద్యుత్ లైట్లు, తాగునీరు, బోరు, మొక్కలు నాటడడం, బెంచీల ఏర్పాటు తదితర వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్కులో ఉండే పిచ్చి మొక్కలను తక్షణమే తొలగించాలని జెడ్పీ ఎస్.వెంకటరమణను ఆదేశించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజల వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, ఏఈ సుమిత్ర, పబ్లిక్ హెల్త్ విభాగం ఏఈ మణికంఠ, పార్టీ పట్టణ కార్యదర్శి గైపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

‘తుమ్మపాల’ కార్మికుల బకాయిలు చెల్లించాలి

అనకాపల్లిటౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన జీవో నెం.15 మేరకు తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయి జీతాలను చెల్లించాలని అనకాపల్లి కో ఆపరేటివ్ సుగర్స్ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి బుద్ధ రామశంకరరావు, మాజీ కార్యదర్శి రాములు శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని సుగర్ ఫ్యాక్టరీల్లో బకాయిపడ్డ కార్మికుల జీతాల నిధుల విడుదలకు జీవో జారీ కావడంతో కడప, చిత్తూరు, తిరుపతి ఫ్యాక్టరీల్లో కార్మికుల బకాయిల్ని ఇప్పటికే చెల్లించారని తెలిపారు. అదే మాదిరిగా తుమ్మపాల కార్మికుల బకాయిల్ని కూడా చెల్లించాలన్నారు. తుమ్మపాల ఫ్యాక్టరీలో 22 మంది శాశ్వత, 236 మంది కాంట్రాక్ట్ కార్మికులు బకాయిల కోసం ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్మికుల బిల్లు ట్రెజరీ కార్యాలయంలో ఉందని, సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని విజయ దశమి ముందే కార్మిక కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు.

సిద్ధి లింగేశ్వర ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం


దేవస్థానం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

అనకాపల్లిటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డు సిద్ధి లింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా సుదురుపాటి తాతాజీ, ధర్మకర్తలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ ధర్మకర్తలుగా కె.వి.త్రివేణి, ఇ.నూకరత్నం, నాగులపల్లి వీర్రాజు, నాగ భోగలింగస్వామి, కుందరపు లక్ష్మి, ఎం.పరమ్మ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎస్.మల్లికార్జునరావులను ప్రభుత్వం నియమించినట్లు శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ తాతాజీ మాట్లాడుతూ శక్తివంచన లేకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్తీకమాసం, సోమవారాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపడతామన్నారు. నూతన చైర్మన్, ధర్మకర్తలను పట్టణంలోని వివిధ దేవాలయాల కమిటీ చైర్మన్లు, సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి

తుమ్మపాల: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ధర్నాకు సంఘీభావం తెలుపుతూ ఉద్యోగుల సమస్యలపై డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వెంకటపతిరాజు పాల్గొన్నారు.

శ్రీగౌరీ పీఏసీఎస్ సభ్యులకు 7.5 శాతం డివిడెంట్


మాట్లాడుతూన్న కాండ్రేగుల కృష్ణఅప్పారావు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ వీవీ రమణ సహకార భవన్‌లో శనివారం జరిగింది. తొలుత సంఘం వ్యవస్థాపకులు స్వర్గీయ వీవీ రమణ చిత్రపటానికి పర్సన్ ఇన్‌చార్జి కాండ్రేగుల కృష్ణ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం స్థాపించిన నుంచి నేటి వరకు సంఘం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. 2022-23 సంవత్సరానికి సంఘం సభ్యులకు 7.5 శాతం డివిడెంట్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 2023-24 నూతన బడ్జెట్ అంచనాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు కర్రి మోదినాయుడు, విల్లూరి రాము, కొణతాల రామ సూర్యనారాయణ, మళ్ల అప్పలనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి రూరల్: దళితవాడల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీవీఎల్ఎన్ గంగాధరరావు తెలిపారు. శనివారం మండలంలోని తగరంపూడి ఎస్సీ కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబుతో కలిసి అయన పాల్గొన్నారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. శ్మశానవాటిక లేకపోవడం, రేషన్ సరకుల వాహనం తమ ఇళ్ల వద్దకు రాకపోవడం, ప్రభుత్వ పాఠశాలలో బోధన సరిగా లేక విద్యార్థుల సంఖ్య పడిపోయిందని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. వీటిని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ ఐతా ఆనంద్‌రాము, వీఆర్వో ఈ శ్రీనివాసరావు, ఏఎస్ఐ భాస్కరరావు, పంచాయతీరాజ్ ఏవో లక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో రామయ్య, కటారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి


అంగన్‌వాడీ పిల్లలకు ఆయుర్వేద మందులు అందిస్తున్న ఆయుర్వేదిక్ వైద్యాధికారి లావణ్య

కశింకోట: పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి కె.లావణ్య సూచించారు. మండలంలోని కన్నూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను పరీక్షించి వ్యాధి నిరోధక శక్తికి ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. జ్వరం, దగ్గు, జలుబు, విరోచనాలు తదితర వ్యాధులు వచ్చినపుడు పిల్లలను సమీపంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్య సేవలందించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమకు వ్యాధులు ప్రబలినప్పుడు సకాలంలో వైద్య సేవలు పొందాలన్నారు. ఆయుర్వేద వైద్యంలో కూడా సీజనల్ వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా పట్ల ఉపాధ్యాయులు స్థానికులకు అవగాహన కలిగించారు. యోగాసనాలు వేయడం, ధ్యానం చేయడంలో తర్ఫీదు ఇచ్చారు. యోగా ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఓపెన్ కరాటేలో విద్యార్థుల ప్రతిభ


జాతీయ ఓపెన్ కరాటే పోటీల విజేతలతో సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గాయత్రి స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ కాటా విభాగంలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో పాల్గొన్న డి.బిందుశ్రీ, సీహెచ్ మోనిక, ఎం.వెంకట్ బంగారు పతకాలు, సీహెచ్ వైష్ణవి, సీహెచ్ యశ్వంత్ వెండి పతకాలు, కె.లోకేష్, సీహెచ్ నీరజ్‌నాయుడు కాంస్య పతకాలను గెలుచుకున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ బి.రామకుమార్, ప్రిన్సిపాల్ వై.నగేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలను యాజమాన్య ప్రతినిధి ఐ.అప్పారావుతోపాటు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ముగింపు దశకు ఈ-పంట నమోదు

కశింకోట: మండలంలో ఈ-పంట నమోదు ముగింపు దశకు చేరుకుందని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న శనివారం తెలిపారు. ఇప్పటికి 7,200 ఎకరాల్లో పంటలను ఈ-పంటలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇంకా సుమారు వంద ఎకరాల వరకు నమోదు చేయాల్సి ఉందన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బ్యాంక్ ఉద్యోగుల ధర్నా


యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానమైన బ్యాంక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని యూనియన్ బ్యాంక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు(తుమ్మపాల) కాండ్రేగుల హరికృష్ణ అన్నారు. మండలంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల పదవీ విరమణ, అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి పిల్లలకు కారుణ్య నియామకాలు, బ్యాంక్‌ల ప్రైవేటీకరణ నిలుపుదల, ఖాళీ పోస్టుల తక్షణ భర్తీ తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని ధ్వంసమైన హైట్ బ్యారియర్


హైట్ బ్యారియర్‌ను ఢీకొన్న టిప్పర్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి–చోడవరం రహదారి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి హైట్ బ్యారియర్‌ను బవులవాడ నుంచి అనకాపల్లి వస్తున్న టిప్పర్ లారీ శనివారం ఢీ కొనడంతో బ్యారియర్ పై రాడ్ విరిగిపడింది. భారీ వాహనాలు అండర్ బ్రిడ్జి కింద ఇరుక్కునే పరిస్థితి లేకుండా అధికారులు అండర్ బ్రిడ్జికి కాస్త ముందుగానే హైట్ బ్యారియర్స్‌ను ఏర్పాటు చేశారు. అయినా డ్రైవర్లు నిర్లక్ష్యంతో వెళ్లేందుకు ప్రయత్నించి వాహనాలకు, బ్యారియర్‌కు నష్టం కలిగిస్తున్నారు.